www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 8 మార్చి 2024

5

తూర్పుగోదావరి

కడియంలో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - కడియం

కడియం సిఐ బి.తులసీధర్ ఆధ్వర్యంలో గ్రామంలో గురువారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ కవాతును నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్‌పి ఎం.అంబికాప్రసాద్ హాజరై మాట్లాడారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో సజావుగా జరిగే దుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిర్వహణకు ఆటంకం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కడియం దేవి సెంటర్లో ప్రారంభమైన కవాతు కడియపు సావరం సెంటర్ వరకు సాగింది.

మి(జ)నరల్ వాటర్

- వేసవితో జోరందుకున్న తాగునీటి వ్యాపారం
- అనుమతి లేకుండా యథేచ్ఛగా నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణ
- శుభ్రత లేని క్యాన్‌లలోనే నీటి విక్రయాలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో మినరల్ వాటర్ పేరుతో నాణ్యతా ప్రమాణాలు లేని ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. వేసవి ప్రారంభం కావడంతో జిల్లాలో నీటి వ్యాపారం జోరందుకుంది. అత్యధిక మంది వ్యాపారులు బోరు నీటిని క్యాన్‌ల్లో నింపి విక్రయిస్తున్నారు. కలుషిత జలాలను సరఫరా చేస్తున్నారు. దీంతో చాలామంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. జిల్లాలో సుమారు 3లక్షలకు పైగా కుటుంబాలు క్యాన్లలో మినరల్ నీటినే వినియోగిస్తున్నారు. నీటికోసం సుమారు రూ.20 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. గ్రామాల్లో పుట్టగొడుగుల్లా నీటిశుద్ధి కర్మాగారాలను ఏర్పాటు చేశారు. కర్మాగార యజమానులకు ఒక్కో 20లీటర్ల క్యాన్ నీటి తయారీకి రవాణా ఖర్చులతో కలిపి రూ.6 కంటే ఎక్కువ కావడం లేదు. వినియోగదారులకు మాత్రం రూ.10 నుంచి రూ.20వరకు విక్రయిస్తూ దోచుకుంటున్నారు. 200 మిల్లీలీటర్ వాటర్ ప్యాకెట్లు తయారుచేసి రూ.2 చొప్పున విక్రయిస్తున్నారు. వీటిపై తయారీ తేదీ ముద్రించట్లేదు. కేవలం శుద్ధిచేసిన నీరు అనే నమ్మకంతో వినియోగదారులు వీటిని వాడుతున్నారు.

కొన్నింటికే అనుమతులు

జిల్లాలో సుమారు 680కిపైగా ఆర్‌ఒ ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో పదుల సంఖ్యలో ప్లాంట్లకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. సాధారణంగా ఐఎస్‌ఐ ప్రమాణాలతో నీటి శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేయాలంటే రూ.35 లక్షల నుంచి రూ.50లక్షల వరకు పెట్టుబడి కావాలి. జిల్లా పరిశ్రమల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నుంచి అనుమతులు ఉండాలి. కాని జిల్లాలో చాలా మంది రూ.3లక్షలు పెట్టుబడి పెట్టి వివిధ సంస్థల పేరుతో అనధికారికంగా నీటిశుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నారు. పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా బోర్లు వేసి నీటిని తోడేస్తున్నారు. కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తూ.. కేవలం బోరువాటరను క్లోరినేషన్ ప్రక్రియ చేసి వడపోసి క్యాన్లలో నింపుతున్నారు. మరికొన్ని ఆర్‌ఒ ప్లాంట్లలో కనీసం వడపోత కూడా లేకుండా బోర్లు, మున్సిపాలిటీ కొళాయి వాటర్‌ను క్యాన్లలో నింపి విక్రయిస్తున్నారు.

ఈ నిబంధనలు తప్పనిసరి

ఆర్‌ఒ ప్లాంట్లలో ముందుగా నీటిని క్లోరినేషన్ చేయాలి. తర్వాత ప్రత్యేకమైన శాండ్ ఫిల్టర్ ద్వారా వడపోయాలి. ఆపై కార్బన్ ఫిల్టర్, మైక్రాన్ ఫిల్టర్ శుభ్రం చేసి మరో కంపార్ట్‌మెంట్‌లోకి పంపాలి. ఆఖరి దశలో ఆక్సిజన్‌ను పంపి ఆక్సీకరణ జరపాలి. ఈ దశలో మినరల్స్‌ను జతచేయాలి. కాని ఆర్‌ఒ ప్లాంట్లలో ఈ దిశగా నీటిని శుద్ధి చేయడం లేదు. ఐఎస్‌ఐ ప్రమాణాలతో నడిచే ఆర్‌ఒ ప్లాంట్లు జిల్లాలో ఐదారు మాత్రమే ఉన్నాయి. నీటిశుద్ధి కర్మాగారాలపై తరుచూ తనిఖీలు నిర్వహించి నాణ్యతా ప్రమాణాలు పరీక్షించాలి. కాని ఇంతవరకు ఒక్క ప్లాంటుపైకూడా తనిఖీలు లేవు. ఆహార తనిఖీ విభాగం, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వీటి వైపు కనీసం కన్నెత్తి చూడటం లేదు. దీంతో కలుషిత నీటి వ్యాపారం యథేచ్ఛగా సాగిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. మినరల్ పేరుతో కలుషిత జలాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్నాం...

జిల్లాలో వాటర్ ప్లాంట్ల నుంచి విక్రయించే నీటి నాణ్యతపై తనిఖీలు జరుగుతున్నాయి. ఆర్‌ఒ ప్లాంటుల నిర్వాహకులు తప్పనిసరిగా ఆర్‌డబ్ల్యూఎస్‌తో పాటు పరిశ్రమల శాఖ వద్ద అనుమతులు తీసుకోవాలి. నాణ్యతా ప్రమాణాలు పాటించని ఆర్‌ఒ ప్లాంటల నిర్వాహకులపై వినియోగదారులు ఫిర్యాదు చేయొచ్చు. ఫుడ్ కంట్రోల్ శాఖ, మండల రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటారు.

- పి. శంకరరావు, ఎస్‌ఇ, ఆర్‌డబ్ల్యూఎస్, తూర్పుగోదావరి జిల్లా

వాస్తవాలనే ప్రచురించాలి

కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

ఎన్నికల్లో ప్రతికూల వార్తలు రాసే సమయంలో వాస్తవాలనే ప్రచురించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పాత్రికేయులకు సూచించారు. ఎన్నికల నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ మాధవీలత, జెసి తేజ్‌భరత్‌తో కలిసి ఎన్నికలలో మీడియా పాత్రపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ సజావుగా జరగడానికి తీసుకున్న ఏర్పాట్లను వివరించారు. ఎన్నికల నిర్వహణపై ప్రతికూల వార్తలు ప్రచురించే సందర్భంలో సంబంధిత పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లి వాస్తవాలను మాత్రమే ప్రచురించాలని కోరారు. అసత్య కథనాలు వల్ల ఇబ్బందికర పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్నారు. వాటికీ సంబందించి వివరణలను కచ్చితంగా ప్రజలకు, ఓటర్లకు చేరవేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి పాత్రికేయులు వాస్తవమైన సమాచారంతో కూడిన రిపోర్టింగ్ చేయాలన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రాంతం, మతం, కులం, జాతి, వర్గం లేదా భాష ఆధారంగా ప్రజల మధ్య విద్వేషాన్ని పెంచే వార్తలను రిపోర్టింగ్ చేయకూడదని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ జారీ చేసే సూచనలను ప్రచురించడం, ప్రసారం చేయడం ద్వారా ప్రజలకు, పోటీలో ఉండే అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ నియమావళిపై అవగాహన కలిగించాలన్నారు. ముఖ్యంగా చెల్లింపు వార్తలు రాసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏ అభ్యర్థి కోసం రాశారో ఆ అభ్యర్థి వ్యయంలో చెల్లింపు వార్త విలువ జమ అవుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఉల్లంఘనలపై వార్తలు రాసి అభ్యర్థులకు, ప్రజలకు అవగాహన కలిగించడానికి మీడియా కృషి చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థికి రూ.95 లక్షలు, ఎంఎల్‌ఎ అభ్యర్థికి రూ.40 లక్షలు వరకు మాత్రమే ఎన్నికల నియమాల్ని అనుసరిస్తూ ఖర్చు పరిమితం చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తామన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులను ఆయా పొలిటికల్ పార్టీల సమక్షంలో ఇవిఎంలో పోటీలో ఉండే అభ్యర్థుల బ్యాలెట్ పేపరు నమోదు జరుగుతుందన్నారు. పోలింగ్ రోజు సాయంత్రం 5 గంటల వరకు ఎంత మంది ఓటర్స్ క్యూ లైన్‌లో ఉంటారో వారందరికీ ఓటు హక్కును వినియోగించడానికి అవకాశం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేశామన్నారు. వికలాంగులు, వృద్ధులు, పోలింగ్ స్టేషన్‌కు రాలేని వారి కోసం ప్రత్యేక రవాణా ఏర్పాట్లను చేశామన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సర్వీస్ ఓటర్లకు, ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు, .అత్యవసర సర్వీసుల్లో ఉన్న వారికీ, హెూం ఓటింగును 85 ఏళ్లు దాటిన వారికి, 40 శాతం పైబడి వికలాంగులకు, కోవిడ్ బారిని పడిన వారికి ఇస్తామన్నారు. అయితే ఓటర్లు అందుకు తగ్గ నిర్ధారణ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఓటర్లుగా నమోదు, ఫిర్యాదులకు, ఎన్నికల ఫలితాల కోసం, అభ్యర్థుల సమాచారం కోసం, ఎన్నికలకు సంబంధిం చిన ఇతర సమాచారం కోసం ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌ను ఎన్నికల కమిషన్ రూపొందించిందన్నారు. మీడియా పాయింట్ ఏర్పాటు చేశామని, సమాచార లోపం లేకుండా ఒక ప్రత్యేక ఫోన్ నంబర్ అందుబాటులో ఉంచి, ఎప్పటి కప్పుడు సమాచారం అందిస్తామన్నారు. సిటిజెన్ విజిల్ యాప్ ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి పనిచేస్తుందన్నారు. జెసి తేజ్‌భరత్ మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనిటరీ మానిటరింగ్, సోషల్ మీడియా సార్వత్రిక ఎన్నికల్లో నోటిఫికేషన్ ప్రారంభం నుంచి ఎన్నిక ప్రక్రియలో కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు మీడియా అనుసరించవలసిన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో డిఐపిఆర్‌ఒ సిహెచ్.శ్రీనివాస్, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. .

జెఇఇ మెయిన్స్‌లో తిరుమల ప్రభంజనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విడుదల చేసిన జెఇఇ మెయిన్స్ (బి. ఆర్క్ అండ్ బి.ప్లానింగ్) జనవరి సెషన్ ఫలితాల్లో తిరుమల ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. బి. ప్లానింగ్ విభాగంలో కె.సాకేత్‌ప్రణవ్ 100 పర్సంటైల్‌తో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడన్నారు. అలాగే బి.ఆర్క్ విభాగంలో కె.సాకేత్‌ప్రణవ్ 99.89 పర్సంటైల్, కె.వెంకటసత్యనీలచలం 99.84 పర్సంటైల్, సిహెచ్.ధనుంజయ 99.84 పర్సంటైల్ సాధించారని తెలిపారు. బి.ఆర్క్, బి.ప్లానింగ్ విభాగాల్లో 99 పర్సంటైల్ పైన 35 మంది, 98 పర్సంటైల్ పైన 72 మంది, 95 పర్సంటైల్ పైన 154 మంది సాధించారని తెలిపారు. విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరిలతో కలిసి ఆయన అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు, కాతేరు, తోర్రేడు, వెంకటనగరం గ్రామాల్లో మంత్రి వేణుగోపాలకృష్ణ స్థానిక నాయకులు అధికారులతో కలిసి రూ.4 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడారు. సిఎం జగన్ ప్రజావసరాలు తీర్చేందుకు, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాలకే డిబిటి ద్వారా సొమ్ములు జమేస్తున్నారన్నారు. అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో గుర్తించిన పనులను ప్రాధాన్యతా క్రమంలో చేస్తున్నామన్నారు. అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా కొంతమూరు, కాతేరు, తోర్రేడు, వెంకటనగరం గ్రామాల్లో రూ.4 కోట్లతో అంతర్గత రహదారులు, డ్రెయినేజీల నిర్మాణ పనులను శంకుస్థాపన చేసుకున్నామన్నారు. గ్రామాల పరిశుభ్రత లక్ష్యంగా రూరల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో శానిటేషన్ మెరుగుదలపై దృష్టి పెట్టామన్నారు. అనంతరం కాతేరు శాంతినగర్‌లో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.53.10 లక్షలతో నిర్మించిన తాగునీటి ట్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎఇ సంపత్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ శ్రీనివాస్‌బాబు, ఎఇ శ్రీనివాసరావు, మాజీ ఎంపిపి రేలంగి వీరవెంకటసత్యనారాయణ, మాజీ సర్పంచులు అత్తిలి బీమా శంకరం, ఆచంట వీర వెంకట సుబ్బారావు, మండల జెసిఎస్ కన్వీనర్ తాడికొండ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలను సత్కరించారు. **కడియం** మండలం వేమగిరి పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. యుటిఎఫ్ మహిళా కార్యదర్శి కె.వనజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు ఎన్.అరుణకుమారి మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటుతున్నా ఇంకా మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. సమస్యలపై ఐక్యంగా పోరాడాలన్నారు. ఎంఇఒలు మణికుమార్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళా వికాసం మరింత వర్ధిల్లాలని, మహిళలంతా ఐక్యతతో ఉండాలని పిలుపునిచ్చారు. మహిళా అసోసియేట్ వనజ, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ అనిత, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేదుల శాస్త్రి, బి.అబ్బాయి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వాలంబన సాధించడానికి ప్రభుత్వాలు మరింత ఊతం ఇవ్వాలని పేర్కొన్నారు. వివిధ పోటీల విజేతలు, విశిష్ట సేవలు అందించిన గెజిటెడ్ హెచ్‌ఎంలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మహిళా నేతలు ఎంఎన్.ఫ్లోరెన్స్, సువర్ణ వేణి, ఎస్‌టిఎఫ్‌ఐ నాయకులు బేబీరాణి, మిడిల్ ఆఫీసర్ స్వరూప, యుటిఎఫ్ నేతలు ఆనంద విజయకుమార్, డిటివిఎస్.నాగేంద్ర, అన్నెం దొరబాబు,చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మహిళా మణులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారులు మణికుమార్, నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డేనియాల్ బాబు, ఎం.లక్ష్మణరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బి.సి జాకబ్, రాష్ట్ర మహిళా కార్యదర్శి జ్యోతి, జిల్లా అభయ్ కన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొని మాట్లాడారు. **ఉండ్రాజవరం** జడ్‌పి ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఇఒ-2 డి.శారదజ్యోత్స్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పలువురు మహిళలను సత్కరించారు. యుటిఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షులు ఐ. రాంబాబు, ఉండ్రాజవరం మండల శాఖ అధ్యక్షులు కే వెంకటరత్నం సన్మాన గ్రహీతలకు ఓట్ ఫర్ ఒపిఎస్ బుక్ లెట్, ప్రజాశక్తి ధీర ప్రత్యేక సంచిక, విలువైన పెన్, శాలువాలను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వి.విశ్వప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి.రామారావు, రామకృష్ణ, షేక్ మీరాసాహెబ్, సుభద్ర భాను, ఆర్‌ఎస్‌ఆర్ ఫణి, తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి** ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో సిఐటియు మండల కార్యదర్శి భగత్ పాల్గొని మాట్లాడారు. ఉద్యమస్ఫూర్తితో శ్రామిక మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లిపూడి వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో రైతు సంఘం సీనియర్ నాయకుడు యు.కృష్ణారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.రత్నాజీ, అంగనవాడీ యూనియన్ నాయకురాలు ఉండవల్లి మంగతాయారు, ఆశా యూనియన్ నాయకులు ఇందిర తదితరులు పాల్గొన్నారు. **రాజానగరం** నన్నయ విశ్వవిద్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విసి ఆచార్య కె.పద్మరాజు, తూర్పుగోదావరి జిల్లా కోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కె.ప్రత్యూష కుమారి హాజరయ్యారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కూచిపూడి డిప్లమా కోర్సు విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు, రంపచోడవరం డిగ్రీ కళాశాల విద్యార్థుల జానపద నృత్యాలు ప్రదర్శించారు. యూనివర్సిటీ ఉమెన్స్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.నూకరత్నం అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. విసి పద్మరాజు మాట్లాడుతూ "మహిళల్లో పెట్టుబడి పెట్టండి పురోగతిని వేగవంతం చేయండి" అనే అంశంపై అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. తూర్పుగోదావరి జిల్లా కోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కె. ప్రత్యూష కుమారి మాట్లాడుతూ ఇన్నింటా మహిళలకు గౌరవం లభించాలన్నారు. మహిళలు సున్నితత్వాన్ని వదిలి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలన్నారు. మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఫస్ట్ ఉమెన్ ప్రమీలరాణి పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, న్యాయవాది ఉమామహేశ్వరి, ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయనిర్మల, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.విజయకుమారి, స్పానిష్ అధ్యాపకులు శివాని, ఉమెన్స్ సెల్ కన్వీనర్ డా.కె.దీప్తి, డా.టి.హైమవతి, రంపచోడవరం ప్రిన్సిపల్ డా.శ్రీనివాస్, డా.వి.మల్లిప్రియ, కె. గీతా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **గోకవరంలో** కమ్యూనిటీ పారామెడిక్స్ ,ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోకవరం పోలీస్ స్టేషన్‌లోని మహిళా కానిస్టేబుల్స్ దుర్గాభవాని, జ్యోతి, అశ్విని, శారద దేవి, భారతిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కె.నాగరాజు మాట్లాడారు. మహిళలు గౌరవించుకోవడం అందరి భాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పిదేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

కడియంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న అరుణకుమారి

నన్నయ యూనివర్శిటీలో...

ఉండ్రాజవరంలో...

కార్టూ'నిజం'



చిత్రలేఖనంలో శ్రీసత్యసాయి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సైన్స్ డే సందర్భగా కొవ్వూరులోని స్వామి వివేకనంద యువజన సమితి నిర్వహించిన ఇన్‌స్పైర్ -2024 సైన్స్ చిత్రలేఖనం పోటీల్లో శ్రీ సత్యసాయి గురుకులం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. గెలుపొందిన విద్యార్థులను, తర్ఫీదునిచ్చిన డ్రాయింగ్ టీచర్లు మోటూరి శ్రీనివాస్, డి.శివాజీలను కరస్పాండెంట్ శ్యామ్‌సుందర్, ప్రిన్సిపల్ గురయ్య అభినందించారు. విద్యార్థులకు జ్ఞాపికలను అందించారు. డ్రాయింగ్ టీచర్లు మాట్లాడుతూ ఇన్‌స్పైర్ పోటీలు జూనియర్స్ విభాగంలో తమ పాఠశాలకు చెందిన ఏడోతరగతి విద్యార్థిని వి.శ్రీవత్సశ్రావణి మొదటి, ఆరో తరగతి విద్యార్థిని ఆర్.హిరణ్యాగాయత్రి ద్వితీయ, ఐదో తరగతికి చెందిన జి.భావన తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. అలాగే సీనియర్స్ విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని బి.అఖిలసాయిసంజన మొదటి, ఏడో తరగతి విద్యార్థిని వై.శ్రీప్రజ్ఞ ద్వితీయ, ఎనిమిదో తరగతి విద్యార్థిని వి.హిమవర్షిణిరెడ్డి తృతీయ స్థానాల్లో నిలిచారు. బాలుర విభాగం జూనియర్స్‌లో ఐదో తరగతి విద్యార్థి ఎం.అర్షశర్వణ్ మొదటి, ఆరో తరగతి విద్యార్థులు సిహెచ్.చరణ్‌శ్రీనివాస్ ద్వితీయ, పి.సంతోష్‌కుమార్ తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. సీనియర్స్ విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు డి.హర్షవర్ధన్ మొదటి, పి.జ్ఞానేశ్వర్ ద్వితీయ, ఆర్.హర్షిత్ తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు.

విద్యార్థులకు జ్ఞాపికలను అందిస్తున్న ప్రిన్సిపల్ గురయ్య, కరస్పాండెంట్ శ్యామ్‌సుందర్

విజేస్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలోని దివాన్ చెరువు విజేస్ ఫార్మసీ కళాశాలలో బి.ఫార్మసీ, ఫార్మా-డి మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బొల్లినేని హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎంఎస్.సతీష్ హాజరై మాట్లాడారు. ఫార్మసీ విద్యార్థులకు స్వదేశీ, విదేశాల్లో ఉన్న ఉపాధి అవకాశాలను వివరించారు. యుఎస్‌లో ఫార్మసీరంగంలో పలు ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. మెడికల్ ఇన్సూరెన్స్ రంగంలో యుఎస్‌లో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. హాస్పిటల్ ఫార్మాసిస్ట్, క్లినికల్ ఫార్మాసిస్ట్, సెంట్రల్ డ్రగ్ ల్యాబొరేటరీస్‌లోనూ ఉన్నత అవకాశాలు పొందే వీలుందన్నారు. విద్యార్థులంతా మొదటి సంవత్సరం నుంచే శ్రద్ధతో చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. ఈ రంగంలో ఉన్నతమైన భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్‌వివి.జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. మొదటి నుంచీ శ్రద్ధగా చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ డి.నరేంద్ర మాట్లాడుతూ మొదటి సంవత్సరం నుంచే జీప్యాట్, పీజీసెట్ వంటి పోటీ పరీక్షలపై శ్రద్ధ కనబర్చాలన్నారు. కళాశాల చైర్‌పర్సన్ ఎన్ శకుంతల మాట్లాడుతూ క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించడంలో తమ కళాశాల ఎప్పుడూ ముందుంటుందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎన్.తులసిఅపూర్వ మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంలో తాము ఎప్పుడూ ముందుంటామన్నారు. విద్యార్థులు శ్రద్ధతో చదివి మంచి మార్కులు పొందాలని కళాశాలలో చేరి మొదటి సంవత్సరం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

నేరాలు ఘోరాలు

దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్ ఫార్మర్‌లో రాగివైరు చోరీ

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని చిట్యాల గ్రామంలో గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్ ఫార్మర్ పగులగొట్టి అందులోని రాగివైరును కాజేశారు. చిట్యాల గ్రామానికి చెందిన గద్దే శ్రీనివాసరావు, యుగంధర్‌లకు చెందిన పొలంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌ను బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు పగుల గొట్టి రాగివైరును దొంగిలించుకుపోయారు. గురువారం పొలానికి వెళ్లిన రైతులు దీన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ట్రాన్స్ ఫార్మర్ విలువ రూ.90 వేలు ఉంటుందన్నారు. కొంత కాలంగా చిట్యాల, పెద్దాపురం గ్రామాల పొలాల్లో మోటార్ వైర్లుదొంగిలించినట్లు రైతులు పేర్కొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఆత్రేయపురం

వెలిచేరులో ఇటీవల అదృశ్యమైన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వెలిచేరు గ్రామానికి చెందిన చిట్టిమేను శ్రీనివాస్ ఈ నెల 4న ఉదయం వెలిచేరు కాలువ రేవుకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. అప్పటి నుంచి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు కాలువ గట్టు వద్ద ఉన్న చెప్పులను గుర్తించారు. ప్రమాదవశాత్తు కాలువలో మునిగిపోయి ఉంటాడని భావించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశారు. గురువారం ఆత్రేయపురం వద్ద కాలువలో మృతదేహం లభ్యమైంది. భౌతికకాయం శ్రీనివాస్‌దిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు

తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

స్వీట్‌స్టాల్స్‌లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి- కడియం

మండలంలోని దుళ్ల గ్రామంలో నాలుగు స్వీట్ స్టాల్స్‌పై విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దత్తసాయి స్వీట్ స్టాల్, సిరి వైభవ స్వీట్స్ అండ్ డైరీ, శ్రీ వెంకటసాయి స్వీట్ స్టాల్, శ్రీ లక్ష్మీ స్వీట్ స్టాల్ యజమానులు ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదని, వారికి నోటీసులు జారీ చేశామని రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి కెఎస్ఎస్‌వి.సుబ్బారెడ్డి తెలిపారు. కిచెన్‌లో శుభ్రతను మెరుగుపరచాలని ఆదేశించారు. ఒక స్వీట్ స్టాల్‌లో అనుమతిలేని తూకపు యంత్రాన్ని ఉపయోగించడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ముత్యాలు నాయుడు, నాగ వెంకటరాజు, భార్గవ మహేష్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు .

కోడిపందేలు నిర్వహిస్తున్న ఏడుగురి అరెస్ట్

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం సింగరాజుపాలెంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. గురువారం గ్రామంలో ఓ వ్యక్తి దినకార్యం జరిగింది. చనిపోయిన వ్యక్తికి కోళ్ల పెంపకంపై మక్కువ ఎక్కువ. ఈ నేపథ్యంలో ఆయన ఆత్మ శాంతి కోసం కొంత మంది గ్రామస్తులు కోడిపందేలు నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

అనుమానాస్పదస్థితిలో వద్ధుడు మతి చెందిన ఘటన గురువారం జరిగింది. గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన పెర్నాడ కృష్ణారావు(60) గోపాలపురం వచ్చి మధ్యాహ్నం నడుచుకుంటూ ఇంటికి బయలుదేరాడు. వేళ్లచింతలగూడెం శివారుకు వచ్చేసరికి విగతజీవిగా పడిఉన్నాడు. వడదెబ్బతో మృతి చెందినట్టు అనుమానిస్తున్నారు.

ఏప్రిల్ 28న బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి - యానాం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని యానాంలో మొదటి సారిగా పుదుచ్చేరి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలు సంయుక్తంగా బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఏప్రిల్ 28న నిర్వహించనున్నట్లు బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాళ్ల జీవన్ ప్రభాకర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ చేతుల మీదుగా ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దుగ్గుదుర్తి మనోజ్ కుమార్, మూదే హరిచంద్ర, మహ్మద్ ఫిరోజ్ పాల్గొన్నారు.

ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ అశోక్

అన్నింటా ఆమే...

ప్రజాశక్తి - జగ్గంపేట

అమ్మగా.. అక్కగా...చెల్లిగా.. భార్యగా..ఇలా అన్నింటా ఆమె స్థానం ఎనలేనిది. ఆ స్థానం ఎవరూ భర్తీ చేయలేనిది. అందుకే ఆడదే ఆధారం.. మన కథ ఆడదే ఆరంభం.. అన్నాడో సినీ కవి. మహిళల ఔనిత్యాన్ని పలువురు కవులు తమ కవితల్లో పొందుపర్చారు.నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్నింటా రాణిస్తున్నారు.ఇదే సమయంలో ఇంకా దోపిడీని ఎదుర్కొంటూనే ఉన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ఏదొక మూల ఇంకా దాడులు జరుగుతూనే ఉన్నాయి.ఈ నేపథ్యంలో మహిళలతో పెట్టుబడి పెట్టండి పురోగతిని వేగవంతం చేయండి అనే థీమ్‌తో నేడు మహిళా దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా పలు రంగాల్లో రాణిస్తున్న కొందరి మహిళా మణుల అంతరంగం వారి మాటల్లోనే...

నేటికీ దోపిడీకి గురవుతున్నారు.

దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలైనా మహిళలు నేటికీ దోపిడికి గురవుతూనే ఉన్నారు. గృహిణిగా, శ్రమజీవిగా, ఉద్యోగిగా, ప్రజాప్రతినిధిగా అన్ని రంగాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్నా సరైన గుర్తింపు లేదు. సమాన హక్కులు, సమాన వేతనాలు దక్కట్లేదు. మహిళల సమానత్వం నాయకుల మాటల్లో తప్ప ఆచరణలో కనిపించట్లేదని చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇంకా కలగానే ఉంది. ఇన్ని సమస్యలున్నా మహిళలను అన్ని రంగాల్లో రాణించి పట్టుదలతో విజయం సాధించి దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అవరోధాలను అధిగమిస్తూ ముందుకు సాగాలని ఆమె తెలిపారు.

- పూర్ణిమ, సిడిపిఒ, జగ్గంపేట

అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

ప్రపంచం అభివృద్ధిలో మహిళల పాత్ర ప్రధానమైనది. అటువంటి మహిళపై నేడు దాడులు అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వాలు మహిళల భద్రత కోసం తెస్తున్న చట్టాలపై పూర్తి అవగాహన ఏర్పాటు చేసుకోవాలి. సమాజంలోని మహిళలపై జరుగుతున్న దాడులపై తోటి మహిళగా స్పందించే తత్వం అలవర్చుకోవాలి. దాడులు జరిగినప్పుడు ప్రతి మహిళ ముందుకు వచి ప్రతిఘటించాలి. అదే మార్పునకు నాంది అవుతుంది.

ఒమ్మి బిందుమాధవి, జడ్‌పిటిసి, జగ్గంపేట

మహిళా సాధికారతకు కృషి చేయాలి

మహిళా లేనిదే సృష్టి లేదు. భూ దేవత సహనం కలవారు మహిళలు. మహిళలు చదువుకుంటున్న ఇంకా ఆశించిన స్థాయిలో గౌరవం పొందడం లేదు. దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధించిన సమాజంలో ఇంకా మహిళలు వెనుకబడే ఉంటున్నారు. మహిళల ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. మానసికంగా బలంగా ఉండి సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనాలి. అన్ని రంగాల్లో రాణించి మహిళా సాధికారత సాధించాలి. ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించాలి, భారతదేశంలో మహిళకు ఉన్న ఔనత్యాన్ని కాపాడాలి.

- విప్పర్తి రజిని, డిగ్రీ విద్యార్థిని, జగ్గంపేట

రంగం ఏదైనా రాణించడమే లక్ష్యం

రంగం ఏదైనా ఉన్నత శిఖరాలను చేరుకుని పురుష శక్తికి తామేమి తీసుకోమని చాటి చెబుతుంది స్త్రీ శక్తి. నేను వైద్యురాలిగా సేవలందిస్తూ ముందుకు వెళుతున్నాను. ప్రతి స్త్రీ కూడా ఇంటి బాధ్యతతోపాటు సామాజిక బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ ముందుకు సాగాలి.

- సౌజన్య, సూపరింటెండెంట్, సిహెచ్‌సి, జగ్గంపేట

కుష్టు వ్యాధి బాధితులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కుష్టు వ్యాధి బాధితులకు పలు ఉపకరణాలను అదనపు డిఎంహెచ్ఒ, డిఎల్ఎటిఒ డాక్టర్ ఎన్.వసుంధర ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. బొమ్మూరు వివేకానంద కాలనీ, ఇమ్మానుయేల్ హెల్పింగ్ హ్యాండ్ లేప్రసి కాలనీలో రోగులకు వాకర్లు, చేతికర్రలు, సెల్ఫ్ కేర్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వసుంధర మాట్లాడుతూ వికలాంగుల కార్పొరేషన్ ద్వారా సంకకర్రలు సేకరించి అందించామన్నారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యులు డాక్టర్ కొప్పిరెడ్డి సుబ్బారావు, సుధ జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రముఖ హోమియో వైద్యులు కొప్పిరెడ్డి రామకృష్ణ, విష్ణు దంపతులు సెల్ఫ్ కేర్ కిట్లు, పండ్లు, ఫలహారం అందించారు. ఈ కార్యక్రమంలో ధవళేశ్వరం పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్, డిపిఎంఒలు ఎం.శివకుమార్, ఆర్.ఈశ్వర్‌రావు, ఎం.దావీదు, జె.వీర్రాజు, రిటైర్డ్ డిపిఎంఒ పివి.కృష్ణారావు, ఎంఎల్‌హెచ్‌పి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలు అందిస్తున్న వైద్యులు వసుంధర తదితరులు

ఘనంగా నారాయణ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 23వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సాంబమూర్తినగర్ సూర్య కళామందిర్ ప్రాంగణంలో జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో థర్డ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ పి.కమలాదేవి పాల్గొని మాట్లాడారు. నారాయణ స్కూల్ చాలా గొప్పగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందకరమని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కార్పొరేట్ స్థాయి ధీటుగా నారాయణ స్కూల్‌ను 23 ఏళ్లుగా నడిపించడం సాధారణ విషయం కాదన్నారు. తరగతి గదిలో విద్యార్థులందరూ నెంబర్ వన్ విద్యార్థులుగా ఎదగలేరని, క్లాసుల్లో శ్రద్ధగా పాఠాలు విని ఎవరైతే పరీక్షల్లో దాన్ని పూర్తిగా అర్థం చేసుకునే రాస్తారో వారే నెంబర్ వన్‌గా నిలుస్తారని అన్నారు. ప్రతి విద్యార్థి నెంబర్వన్‌గా ఉండాలంటే క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమన్నారు. కరెస్పాండెంట్ టిఎస్‌వి నారాయణ మాట్లాడుతూ ఈ స్కూలు నడిపించడానికి కారణం నేను చదువుకున్న రోజుల్లో మా ఉపాధ్యాయులే కారణమని అన్నారు. వారి ప్రోత్సాహంతోనే తాను ఉపాధ్యాయ రంగాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. ప్రస్తుత విద్యారంగంలో మహా విద్యాసంస్థల నుంచి ఒక ప్రత్యేక మార్కు తీసుకురావాలని అలా తీసుకురావడానికి 23 సంవత్సరాలుగా ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. కాకినాడ నగరంలో మా స్కూలుకి ఒక ప్రత్యేకత ఉందని, చదువుతోపాటు అనేక విషయాల్ని మా

స్కూల్లో విద్యార్థులకు తెలియజేస్తున్నామని తెలిపారు. క్రమశిక్షణ, ప్రణాళిక బద్ధంగా చదువుకోవడం ఎలా అనే విషయాలపై నిరంతరం మా అధ్యాపకు బృందం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జి.సునీల్‌కాంత్‌కుమార్, గీతం స్కూల్ కరస్పాండెంట్ సుజ్ఞాన్, ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లీదండ్రులు పాల్గొన్నారు.

12న ఆర్ట్స్ కళాశాలలో జాబ్‌ఫెస్ట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రభుత్వ అటానమస్ కళాశాలలో ఈ నెల 12న జాబ్ ఫెస్ట్-2024ను నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర.ఆర్‌కె తెలిపారు. ఈ జాబ్ ఫెస్ట్‌లో 25కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 500 పైగా ఉద్యోగాలు భర్తీ చేస్తారన్నారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆధర్వంలో ఎపిఎస్ఎస్‌డిసి సహకారంతో ఈ జాబ్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాలలో నోడల్ రిసోర్స్ సెంటర్ రాజమండ్రి ఆధ్వర్యంలో జరిగిన మీటింగ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు, జెకెసి కో-ఆర్డినేటర్లు, జెకెసి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జాబ్ ఫెస్ట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

10న దళితుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు గ్రామంలో ఈ నెల 10న నిర్వహించే వైసిపి దళితుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. కడింపాడు, మల్లేశ్వరం గ్రామాల్లో వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్టి రాంబాబు ఆధ్వర్యంలో నాయకులు గురువారం పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు భావన మధు, బీరా స్తోత్ర రాజు, స్టేట్ ఇరిగేషన్ డైరెక్టర్ దొడ్డిగర్ల బాలకృష్ణ, నాయకులు కాకర భాస్కర్, రొట్టె నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

మండల అభివృద్ధికి కృషి చేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి - గోపాలపురం

అధికారులు, నాయకులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ సూచించారు. ఎంపిడిఒ కార్యాలయంలో గురువవారం ఎంపిపి సత్యనారాయణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామస్థాయిలో మండల పరిషత్ నిధుల నుంచి మంజూరు చేసిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అధికారులకు ఆయా గ్రామాల నాయకులు సహకరించాలని సూచించారు. ఎంపిడిఒ కె.రమేష్, తహశీల్దార్ కె.వనజాక్షి, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాష్కరరావు, వైస్ ఎంపిపి వంగానారాయణమ్మ, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు సీలు వేస్తున్న సిబ్బంది

మండలానికి చేరిన ఇవిఎంలు

ప్రజాశక్తి - గోపాలపురం

రానున్న ఎన్నికలకు సంబంధించి ఇవిఎంలు, వివి ప్యాడ్స్ మండలానికి చేరాయని, వాటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచామని తహశీల్దార్ డి.వనజాక్షి తెలిపారు. ఇవిఎంలు, వివిప్యాడ్స్ 18 వచ్చాయన్నారు. దేవరపల్లి సిఐ బాల సురేష్‌బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సతీష్‌కుమార్, డిటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా విడుదలపై హర్షం

దేవరపల్లి : ప్రొఫెసర్ జిఎన్.సాయిబాబా విడుదలపై ప్రగశీల కార్మిక సమాఖ్య హర్షం వ్యక్తం చేశారు. నాగపూర్ జైల్లో యావజ్జీవ కారాగార శిక్ష విధింపబడి పదేళ్లుగా జైలుల్లో నిర్బంధానికి గురై విడుదలైన సందర్భంగా ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కె.మస్తాన్, రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 2014లో మావోయిస్టులతో సంబంధాలున్నాయని, విప్లవ సాహిత్యం కలిగి ఉన్నాడని తప్పుడు కేసులు నమోదు చేసి ఆయన్ని అరెస్టు చేశారన్నారు. ముంబై హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా తీర్పునిచ్చింది. దీంతో ఆయన విడుదలయ్యారు.

అన్నవరం పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం పంచాయతీలో కార్యదర్శిగా పనిచేస్తున్న శివరామకృష్ణపై వైస్ ఎంపిపి వెంకటరమణ, వార్డు సభ్యురాలు దారా పార్వతి ఎంపిడిఒకి ఫిర్యాదు చేశారు. ప్రోటోకాల్ ప్రకారం పంచాయతీలో జరిగే కార్యక్రమాలకు తమను ఆహ్వానించాల్సివుందని, అయితే ఆయన ప్రోటోకాల్‌ను పాటించడం లేదని, ఇటీవల కొత్తపేటలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల శంకుస్థాపన సంబంధిత వార్డు మెంబర్‌కి తెలియపరచలేదని తెలిపారు. హిందూ స్మశాన వాటిక దగ్గర సిసి రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపనకు తమకు ఆహ్వానం లేదన్నారు. సర్పంచ్, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇదే విషయంపై కార్యదర్శిని వివరణ కోరగా ఆయా శంకుస్థాపనలకు గుమస్తా ద్వారా సమాచారాన్ని ఇచ్చినట్లు తెలిపారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని రంపఎర్రంపాలెం గ్రామంలో జగనన్న ఇంటి స్థలాల పట్టాలను 81 మంది లబ్ధిదారులకు వైసిపి మండల అధ్యక్షుడు పాటి రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సిఎం జగన్ నెరవేరుస్తున్నారన్నారన్నారు. అందులో భాగంగానే అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు అందించారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ప్రజల అవసరాలను తీర్చడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

మండలంలోని కృష్ణునిపాలెంలో సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, భర్త జోగేశ్వరరావు ఆధ్వర్యంలో 175 మందికి ఇంటి స్థలాల పట్టాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అంబటి ప్రసన్న, సచివాలయం, పంచాయతీ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆసుపత్రికి సామగ్రి అందజేత

ప్రజాశక్తి - గోపాలపురం

జంగారెడ్డి గూడేనికి చెందిన నవభారత్ లిమిటెడ్ ఫౌండేషన్, ఎఎస్ చౌదరి ఫౌండర్ పేరున రూ.8లక్షల విలువ చేసే సామగ్రిని గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి గురువారం అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చైతన్యరాజు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం నవభారత్ లిమిటెడ్ ఫౌండేషన్ వారు సామాజిక ఆరోగ్య కేంద్రానికి అవసరమయ్యే ఎసి, వాషింగ్ మిషన్, ఆఫీస్ ఫర్నిచర్, కంప్యూటర్స్, ఇసిజి మిషన్, చైర్స్ తదితర 23 రకాల సామగ్రిని అందించారన్నారు. ఈ సందర్భంగా నవభారత్ లిమిటెడ్ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అత్తిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కర్‌రావు, ఎంపిపి ఉండవల్లి

సత్యనారాయణ, వెలగా శ్రీరామమూర్తి, సర్పంచులు కురుకూరి ధనలక్ష్మి, పైడి శిరీష, మడిచర్ల ప్రసాద్, ఆన్సర్ భాషా, అసిస్టెంట్ మేనేజర్ జి.లీలాకృష్ణ, ఏరియా మేనేజర్ అనిశెట్టి వీర్రాజు, వైద్యులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎంఎల్ఎ తలారి వెంకట్రావు

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - చాగల్లు

మండల అభివృద్ధికి అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎంపిపి మట్ట వీరస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తలారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపిడిఒ ఎన్.బుజ్జి, తహశీల్దార్ ఎం.సావిత్రి పలువురు అధికారులు అభివద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడానికి అధికారులు అహర్నిశలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు. అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ ఉండమట్ల మనశ్శాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భూహక్కుపత్రాలను ఎంఎల్ఎ లబ్ధిదారులకు అందించారు. తరువాత రూ.2కోట్లతో చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ఎంఎల్ఎ ప్రారంభించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

భీమిరెడ్డి కుటుంబానికి ఆకుల పరామర్శ

ప్రజాశక్తి-కడియం

సతీవియోగంతో బాధపడుతున్న మండలంలోని పొట్టిలంక గ్రామానికి చెందిన రాష్ట్ర శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్రను, డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు గురువారం పరామర్శించారు. ముందుగా శేషారత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. భీమిరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



శేషారత్నానికి నివాళులర్పిస్తున్న వీర్రాజు

యాత్రికులకు భోజన, వసతి సౌకర్యం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

శివరాత్రిని పురస్కరించుకుని వచ్చే యాత్రికులకు ఇబ్బంది లేకుండా పటిష్ట భద్రతా చర్యలతో పాటూ, భోజన, వసతి కల్పించామని పాలంగి శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎంవి.రామయ్య తెలిపారు. గురువారం దేవాలయం వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. రాత్రి స్వామివారికి ఊరేగింపు నిర్వహించిన అనంతరం అర్ధరాత్రి నుంచి యాత్రికులు దర్శనం చేసుకుంటారన్నారు. చైర్మన్, బోర్డు సభ్యుల ఆధ్వర్యంలో దేవస్థానం ప్రాంగణంలో అన్న సమారాధన ఉంటుందన్నారు. నిడదవోలు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు ప్రత్యేక ఆహ్వానితులుగా, ఎంపిపి పొలాటి యల్లారీశ్వరి, సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, రైతు సంఘం అధ్యక్షులు బూరుగుపల్లి సుబ్బారావు, జడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య, ఎఎంసి వైస్ చైర్మన్ వెలిచేటి జానకి రామయ్య ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ దొడ్డా సూర్యనారాయణ, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న రామయ్య

ఇంగ్లీష్ పరీక్షకు 228 మంది హాజరు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు శ్రీ వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీషు పరీక్షకు 229మంది విద్యార్థులకు 228 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపల్ పావని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99189

In the Court of the 7th Additional Junior Civil Judge at Kakinada
I.A. No. 225/2023 in O.S. No. 988/2023
Between:
State Bank of India, Sarpavaram Junction Branch, Kakinada, Rep. by its Branch Manager.
...*Petitioner/ Plaintiff*
AND
Kapilavai Ramananda Kumar
...*Respondent/ Defendant*
To:
Kapilavai Ramananda Kumar, S/o. Bala Saraswathy Swami, Hindu, aged 58 years, D.No. 17-24-9, Plot No. 301, Sarada Sadan, Vangaveeti vari Veedhi, Seethampeta, Sriram Nagar, Rajamahendravaram - 533105.
పై నెంబరు దావా మరియు పిటిషన్‌లో ప్రతివాది/ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు మరియు I.A. No. 225/2023 నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 20-03-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మరియు పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
K.V.S.V.LAKSHMOJI RAO
Advocate, Kakinada
Cell: 9866211196

మహారాజశ్రీ అనపర్తి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 64/2024
Between:
కర్రి వీర వెంకట సాయిరెడ్డి, S/o. ఆదిరెడ్డి, డోర్ నెంబర్: 3-39, కొప్పవరం గ్రామం, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జిల్లా, పిన్‌కోడ్ 533342. **-వాది**
మరియు
మందరపు మేరీ ఆన్ డిసౌజా అనే మందరపు రిషిక, W/o. నాగేంద్ర శివ శంకర్‌కుమార్, డోర్ నెంబర్: 2-11-4/7, నాగార్జున అపార్ట్‌మెంట్స్, వెంకట్ నగర్, కాకినాడ అర్బన్, కాకినాడ జిల్లా, పిన్: 533003. **-ప్రతివాది**
పై నెంబరు దావా గ్రంథమునకు గాను ప్రతివాది హాజరు నిమిత్తము మీకు ఎన్నిసార్లు కోర్టు సమన్సు/ నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యం పూర్వకముగా సదరు కోర్టు సమన్సు/ నోటీసులను త్రిప్పివేయుచున్నారు. కావున **ది. 08-04-2024 ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, లేదా మీ తరపు అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు దావా/పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది)
టి.వి.వి.రమణమూర్తి
అడ్వకేట్, దుప్పలపూడి
సెల్: 9652736367 (4)

మహారాజశ్రీ అనపర్తి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A. No. 123/2023 in O.S. No. 64/2024
Between:
కర్రి వీర వెంకట సాయిరెడ్డి, S/o. ఆదిరెడ్డి, డోర్ నెంబర్: 3-39, కొప్పవరం గ్రామం, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జిల్లా, పిన్‌కోడ్ 533342. **-పిటీషనర్**
మరియు
మందరపు మేరీ ఆన్ డిసౌజా అనే మందరపు రిషిక, W/o. నాగేంద్ర శివ శంకర్‌కుమార్, డోర్ నెంబర్: 2-11-4/7, నాగార్జున అపార్ట్‌మెంట్స్, వెంకట్ నగర్, కాకినాడ అర్బన్, కాకినాడ జిల్లా, పిన్: 533003. **-రెస్పాండెంటు**
పై నెంబరు పిటీషనుకు గాను రెస్పాండెంటు హాజరు నిమిత్తము మీకు ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యం పూర్వకముగా సదరు కోర్టు సమన్సు/ నోటీసులను త్రిప్పివేయుచున్నారు. కావున **ది. 08-04-2024 ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, లేదా మీ తరపు అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు దావా/పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది)
టి.వి.వి.రమణమూర్తి
అడ్వకేట్, దుప్పలపూడి
సెల్: 9652736367 (4)

మహారాజశ్రీ అదనపు జూనియర్ సివిల్ జడి వారి కోర్టు, పిఠాపురం
F.D.I.A. No. 2/2023 in O.S. No. 65/2017
బిట్వీన్:
ఈగల కృష్ణ -పిటీషనరు
మరియు
ఈగల నాగరాజు మరియు వగైరాలు -రెస్పాండెంట్స్
To:
R-3: మురుకుర్తి మంగ, భర్త: నాగరాజు, వయస్సు 44 సం॥లు, గృహిణి, డోర్ నెం. 3-106, అనంతపల్లి గ్రామం, సీతారామపేట కాలనీ, అంబేద్కర్ స్టాట్యూ లైను వీధి దగ్గర, వినాయక ఆర్చి, నల్లజర్ల మండలం, పూర్వం పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా.
R-4: పక్కుర్తి నేరేళమ్మ, భర్త: శేషారావు, వయస్సు 42 సం॥లు, గృహిణి, డోరు నెం. 3-107, అనంతపల్లి గ్రామం, సీతారామపేట కాలనీ, అంబేద్కర్ స్టాట్యూ లైను వీధి దగ్గర, వినాయక ఆర్చి, నల్లజర్ల మండలం, పూర్వం పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా.
పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటిషన్‌లో 3వ మరియు 4వ రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 28-3-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై ఫైనల్ డిక్రీ పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
నక్కిన మల్లిఖార్జునరావు, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9848913888